క్షమాగుణం అలవర్చుకోవాలి



లోక్‌అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద. చిత్రంలో న్యాయమూర్తులు జితేందర్, రీటా లాల్‌చంద్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్షమాగుణాన్ని అలవరచుకొని రాజీపడదగ్గవంటే ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మెదక్, నర్సాపూర్ కోర్టుల పరిధిలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 3,034 కేసులు పరిష్కరించారని.. రూ.76,13,156 చెల్లించారని తెలిపారు. అంతకు ముందు స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటా లాల్‌చంద్, పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్ర గౌడ్ పాల్గొన్నారు.

నర్సాపూర్: క్షణికావేశంలో గొడవలు పడి పోలీసు కేసులు పెట్టుకొని కోర్టు మెట్లు తిరిగి విలువైన సమయం, డబ్బు వృథా చేసుకోకుండా ఇరువర్గాలు రాజీ పడటం ద్వారా పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి అనిత సూచించారు. నర్సాపూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిత

లోక్‌అదాలత్‌లో 6,061 కేసులు రాజీ: ఎస్పీ

మెదక్: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా జిల్లాలో మొత్తం 6,061 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 489 ఎఫ్ఐఆర్ కేసులు, 1,655 ఈ-పెట్టి కేసులు, 3,917 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాజీమార్గం ఉత్తమమైందని సూచించారు.

మీ గుండె చప్పుడు.. వినండి!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



అందరికీ హాయ్..
నేను మీ గుండెను..

నేను లబ్‌డబ్ అనే వరకు నీ ఊపిరి నిలుస్తుంది. శరీరంలో కీలకంగా పని చేస్తూ నిన్ను నడిపించేది నేనే. నా స్వరం వందేళ్ల దాకా, మధ్యలోనే ఆగిపోవాలా అనేది.. నీ అలవాట్లపై ఆధారపడి ఉంది సుమా..! పొగ, మద్యం, కొవ్వు పదార్థాల వంటివి రుచించవు. అయినా వినకుండా కొందరు వాటినే ఇష్టంగా తీసుకుంటూ నన్ను బాధపెడుతున్నారు. నాలో నాలుగు గదులకు రక్తం, ఆక్సిజన్ అందక అలసిపోయి ఆగిపోతున్నా. ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లను మార్చుకుంటే పదిలంగా ఉంటాను. నేడు గుండె దినోత్సవం సందర్భంగా నువ్వేమి చేయాలో చెప్పడానికి వచ్చా..

– న్యూస్‌టుడే, మెదక్, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

కల్తీతో మరింత ప్రమాదం



ఇటీవల కాలంలో అన్నీ కల్తీ అవుతున్నాయి. నూనె విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, తాండూరు వంటి ప్రాంతాల్లో అల్లం, వెల్లుల్లి పేస్టును కల్తీ చేస్తున్నారు. ఇక నాలుగు జిల్లాల్లో కల్తీ నూనె, నెయ్యిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీటిని వాడుతూ నన్ను బాధిస్తున్నారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇటీవల పాతికేళ్లు కూడా నిండని యువత గుండెపోటుతో మరణించిన ఘటనలున్నాయి. తాజాగా పదో తరగతి విద్యార్థి ఇదే రీతిలో ప్రాణం కోల్పోయాడు. దీనికి ఒక్కటే కారణం జంక్‌ఫుడ్ అలవాటు పడటమే. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో శుచి, శుభ్రత లేని ఆహారం తింటున్నారు. కొవ్వు, నూనె ఎక్కువగా వాడుతున్నవి ఇష్టానుసారంగా తింటుండటం నాకు చేటు చేస్తోంది. వైద్యులు.. అలాంటివి తినొద్దని చెబుతున్నా మీరు వినట్లేదు. ఒకప్పుడు ఎక్కడో ఓ చోట కనిపించే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు.. ఇప్పుడు అడుగడుగునా కనిపిస్తున్నాయి. మారుమూల గ్రామాలకూ పాకింది. నాలుగు జిల్లాల్లో వెయ్యికి పైగా ఉన్నట్లు అంచనా.

జిల్లాల్లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ● సంగారెడ్డి 22 ● మెదక్ 48 ● సిద్దిపేట 72 ● వికారాబాద్ 42

నూనె తగ్గించుకోవాల్సిందే..



నూనె విషయంలో జాగ్రత్తలు పాటించడం ప్రధానం. ప్రస్తుతం వేరుశనగలు, ఇతరత్రా వాటి ధరలు అధికంగా ఉన్నాయి. నూనె తక్కువ ధరకు అమ్ముతున్నారంటే కల్తీ అని ఆలోచించాల్సిందే. నిత్యం 20 గ్రాముల మాత్రమే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. నెలకు అర లీటరు మించి వాడరాదు. గ్రామాల్లో ఇప్పటికీ వందేళ్లు దాటిన వారున్నారు. వారు నన్ను ఎంత బాగా చూసుకుంటున్నారో అర్థం చేసుకోండి.

అత్యవసరంలో సీపీఆర్ ఇలా..



గుండె కొట్టుకోవడం ఆగితే వెంటనే సీపీఆర్ చేసి కాపాడుకోవచ్చు. గుండెకు పంపింగ్ చేస్తూ అదే సమయంలో ఊపిరితిత్తులు ఒదిమితే ఆక్సిజన్ తీసుకునేలా చేయాలి. సీపీఆర్ చేస్తున్నప్పుడు రోగి నోటి ద్వారా గాలి అందించాలి. ఇలే చేస్తే గుండెపోటు వచ్చిన బాధితులను ఆదుకునేందుకు వీలుంటుంది. ఇటీవల నాలుగు జిల్లాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

జాప్యం చేయొద్దు..


నాలుగు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసరంలో గుండె జబ్బు కల్గిన వారికి ఉచితంగా ఈసీజీ, టూడీకో వంటి పరీక్షలు చేస్తారు. ప్రాణాపాయం నుంచి తప్పించేలా ఓ టీకాను (ఓ దశ వరకు) అందుబాటులోకి తీసుకొచ్చారు. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి తరలిస్తే టెనిక్టప్లెస్ 40ఎంజీ టీకా ఇస్తారు. గుండెలో ఉన్న గడ్డను టీకా కరిగించి ప్రాణాపాయం నుంచి తప్పిస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి



ఒకప్పుడు 60 ఏళ్లకు పైబడిన వారు రక్తపోటు, మధుమేహం, గుండె వ్యాధులతో బాధపడేవారు. ఇప్పుడు 30 ఏళ్లకే వాటి బారినపడుతున్నారు. జీవనశైలిలో మార్పు, ఆహార అలవాట్లు ప్రభావం చూపుతున్నాయి. 6 నెలలకోసారి పరీక్షలు చేయించుకోవాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి. – డా. అనిల్ కుమార్, కార్డియాలజిస్ట్, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా వెల్లడైన అంశాలు..



ప్రశ్న	అవును	లేదు
వ్యాయామం చేస్తున్నారా?	51	149
సమయానికి నిద్ర పోతున్నారా?	110	90
బయటకు వెళ్లినప్పుడు జంక్‌ఫుడ్, ఇతర ఆహారం తీసుకుంటున్నారా?	87	113

మీ ఇంట్లో వంటనూనె వాడకంపై అవగాహన ఉందా?	ఉంది	లేదు
	123	77

చిరుత గుర్తింపునకు కెమెరాలు



చెట్టుకు ఏర్పాటు చేసిన కెమెరాలు

రామాయంపేట, న్యూస్‌టుడే: చిరుత సంచరిస్తుందనే అనుమానంతో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రామాయంపేట పట్టణ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద శుక్రవారం చిరుత సంచరించినట్లు రైతులు తెలిపారు. అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించినా చిరుత సంచారం ఆనవాళ్లు కనిపించలేదని చెబుతున్నారు. దాన్ని గుర్తించేందుకే కెమెరాలు ఏర్పాటు చేశామని రామాయంపేట ఎఫ్ఆర్ఓ విద్యాసాగర్ తెలిపారు.

నిందితులకు బెయిల్ ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్, పాపన్నపేట: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తాఖీదులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, దీంతో కేసు నీరుగారే ప్రమాదం ఉందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. విచారణ చేయకుండా స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని, అలా కాకుండా కోర్టుకు పంపితేనే భయం పెరుగుతుందన్నారు. జిల్లాలోనే ఎక్కువ సమస్యలు ఉన్నాయని, కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌతోజీగూడ ఘటనలో 20 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో అడ్డుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతను బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో చంద్రశేఖర్, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యువతపైనే దేశ భవిష్యత్తు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంటుందని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వామీ వివేకనంద జయంతి పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన యువజన వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు మొత్తం 650 మంది విద్యార్థులు, యువకులు పాల్గొనగా.. 53 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, పీడీలు మాధవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు సరికాదు: ఎస్ఎఫ్ఐ

మెదక్ టౌన్: ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నాను నిర్వహించి వెళ్తున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు.



శివ్వంపేటలో కోతుల దండు



కోతులు ధ్వంసం చేయడంతో నేలవాలిన వరి

మర్కటంతో మహా సంకటం

గ్రామాల్లో కోతులు మనుషులపై దాడి చేయడంతో పాటు పొలాల్లో సైతం పంటలను ధ్వంసం చేస్తున్నాయి. శివ్వంపేటలో పెద్ద చెరువు, గ్రామానికి సమీపంలో ఉన్న పంట పొలాల్లో వేలాది కోతులు సంచరిస్తున్నాయి. వరి పంటను చీరి ధ్వంసం చేస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న వరిని తింటున్నాయి. గతంలో అడవి పందుల కలిగే ఎన్నో రేట్ల ఎక్కువ నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్రలతో కోతులను తరిమినా గుంపుగా వచ్చి రైతులపై దాడి చేస్తున్నాయి. పొలాల్లోకి వెళ్లాలంటే భయమేస్తోందని, కోతుల బెడద నుంచి రక్షించాలని రైతులు కోరారు.

–న్యూస్‌టుడే, శివ్వంపేట

అతివల క్యాంటీన్లు



హనుమకొండ క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మెప్మా సిబ్బంది

మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు

న్యూస్‌టుడే–మెదక్: పేదరికాన్ని నిర్మూలిస్తూ.. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇందిర మహిళా శక్తి పథకం(ఐఎంహెచ్‌ఎస్) కింద మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. మహిళా(ఎస్‌ఏహెచ్) సంఘాల్లోని సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించేందుకు దోహదం చేయనుంది. తదనుగుణంగా జిల్లాలో మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో ఈ ఏడాది రెండు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించుకోగా.. త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు వేగవంతమయ్యాయి.

ముందుగా రద్దీ ప్రాంతాలు...

జిల్లాలో శుచి, రుచి, నాణ్యత కలిగిన క్యాంటీన్లు అందుబాటులోకి తెచ్చేందుకు మెప్మా అధికారులు దృష్టి సారించారు. పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో రద్దీ ప్రాంతాలను ఎంపిక చేశారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ.5 నుంచి రూ.7లక్షల వరకు పూచీకత్తు, వడ్డీ లేకుండా బ్యాంక్ రుణాలు ఇవ్వనున్నారు. జిల్లా పరిధిలో మొదటగా రెండు క్యాంటీన్లను వచ్చే నెలలో అందుబాటులోకి తేనున్నారు. ప్రభుత్వ సముదాయాల వద్ద కొన్నాళ్లు భవన అద్దెకు మినహాయింపు ఇస్తారు. క్యాంటీన్ల నిర్వహణలో భాగంగా తొలుత మహిళా సంఘాలతో మెప్మా సిబ్బంది క్షేత్ర పర్యటనలు చేపడుతున్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను పరిశీలించారు.

క్యాంటీన్లు ఏర్పాటయ్యే ప్రాంతాలు

మెదక్:	జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి
నర్సాపూర్:	ప్రాంతీయ ఆసుపత్రి

మెప్మా పరిధిలో...

పట్టణాలు	4
వార్డులు	75
మహిళా సంఘాలు	1,811
సభ్యులు	16,915

నిర్వహణ ఇలా..

● పరిశుభ్ర వాతావరణంలో నిర్వహించాలి. ● ఆహార పదార్థాల నాణ్యత, రుచికి పెద్దపీట. ● ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరవాలి.
● అల్పాహారం, చిరుతిళ్లు, తేనీరు, మధ్యాహ్నం భోజనం ఉంటుంది.
● తెలంగాణ పిండివంటలు ప్రత్యేకం. ● అందుబాటు ధరలకు విక్రయిస్తారు.

ఆర్థికంగా బలోపేతం : ఇందిరా, పీడీ, మెప్మా



క్యాంటీన్ల ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో పాటు మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. దరఖాస్తు చేసుకుంటే లక్ష్యం, ప్రాధాన్యం మేర మంజూరు చేస్తాం. ప్రస్తుతం 2 ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

సర్దుబాటు జీవో సవరించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సభ్యులు

మెదక్, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన సర్దుబాటుకు సంబంధించిన జీవో నం.25ను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి.. కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసరావు, పద్మారావు, రవీందర్‌రెడ్డి, సంగయ్య, యాదగిరి, భీమ్లానాయక్, హీరాలాల్ తదితరులు ఉన్నారు.

హవేలీఘనపూర్, న్యూస్‌టుడే: జీవో 25 సవరణ తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హవేలీఘనపూర్ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న సర్దుబాటు పేరుతో ఇతర పాఠశాలలకు కేటాయిస్తే బోధన ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బైతి ఐలయ్య, నాయకులు శేఖర్, మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: పాడైన మోటార్లు, చేతి పంపులు మరమ్మతులు చేసి ప్రజల నీటి అవసరాలు తీర్చాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ మంచినీటి వ్యవస్థ, చేతి పంపులు, నీటి శుద్ధిపై శిక్షణ పొందారని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా ఈఈ సంపత్ కుమార్, ఎంపీడీవో రఘు, డీఈ రవి కుమార్, మిషన్ భగీరథ డీఈ పల్లవి, ఏఈ రాజు, తదితరులు ఉన్నారు.

కొడిపల్లి: రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య సూచించారు. శనివారం కొడిపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచనలు చేశారు.

క్రాప్ సర్వేతో అదనపు భారం

మెదక్, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ సర్వే నుంచి మినహాయించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఏఈవోలతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలను వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారానే క్షేత్రస్థాయిలో అందుతున్నాయని, డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో అదనపు భారాన్ని మోపడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఫజలుద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం

● తుది ఓటరు జాబితా విడుదల

న్యూస్‌టుడే-మెదక్

గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తులో తుది అంకం పూర్తయింది. శనివారం జిల్లాలోని పంచాయతీల వద్ద ఓటర్ల తుది జాబితా ప్రదర్శించారు. శాసనసభ స్థానాల వారీగా ఇటీవల విడుదల చేసిన తుది జాబితా ప్రకారం దీన్ని సిద్ధం చేశారు. బీసీ గణన పూర్తయిన తర్వాతే పల్లె పోరు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం...

జిల్లాలో ఇలా...

నియోజకవర్గం	పంచాయతీలు	ఓటర్లు
మెదక్	152	1,61,386
నర్సాపూర్	179	1,66,243
అందోల్	63	70,375
దుబ్బాక	38	47,984
గజ్వేల్	31	34,986
నారాయణఖేడ్	28	31,303


జిల్లాలో గ్రామ పంచాయతీలు:	493
వీటిలో కొత్తవి:	24
వార్డు స్థానాలు:	4,232
వీటిలో కొత్తవి:	146

తుది జాబితా ప్రకారం....

మొత్తం ఓటర్లు	5,12,277
మహిళలు	2,65,454
పురుషులు	2,46,814
ఇతరులు	9

రిజర్వేషన్లపైనే చర్చ

జిల్లాలో 493 పంచాయతీలకు గాను మెదక్ మండలంలో ఒకటి, హవేలీఘనపూర్ మండలంలో ఒక పంచాయతీ మినహా మిగిలిన 491 వాటికి ఎన్నికలు జరగనున్నాయి. తుది ఓటరు జాబితా ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల చర్చ మొదలైంది. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకొచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ మేరకు నిర్వహిస్తుందా?.. లేక రిజర్వేషన్లను మారుస్తుందా.. అనే సందిగ్ధం నెలకొంది. మరోవైపు ప్రభుత్వం బీసీ గణన నిర్వహించాకే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. బీసీ గణనకు మూడు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది.



నర్సాపూర్‌లో అత్యధికం...

తుది జాబితా ప్రకారం జిల్లాలో 5.12 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో నర్సాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 1.66 లక్షల మంది, అత్యల్పంగా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పెద్దశంకరంపేట మండలంలో 31,303 మంది ఉన్నారు.

45రోజుల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారం

న్యూస్‌టుడే, తూప్రాన్: విద్యుత్తు వినియోగదారుల సదస్సులో వచ్చిన ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరిస్తున్నామని, ఆలస్యమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఫోరం ఛైర్మన్ రామాంజనేయులు నాయక్ సూచించారు. శనివారం తూప్రాన్ విద్యుత్తు కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 207 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫోరం అధికారి వెంకట్, తూప్రాన్ డీఈ రాజేందర్ అధికారులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: అత్తింటి ఆరళ్లకు తాళలేని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. హుమాయున్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 ఆగస్టులో టోలిచౌకి హకీంపేటలోని ఐఏఎస్ కాలనీకి చెందిన రుహిసుల్తానా(35)కు మెదక్ జిల్లా తూప్రాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముకర్రం(40)తో వివాహమైంది. వీరికి ఆరు నెలల బాబు ఉన్నాడు. వివాహ సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని.. అదనపు కట్నం తీసుకురావాలని భర్త, ఆడపడుచు రహీమున్నీసా.. రుహిసుల్తానాను వేధిస్తున్నారు. దీంతో కొద్ది కాలంగా ఆమె హకీంపేటలోని తల్లిగారింట్లో ఉంటోంది. రెండు నెలల క్రితం భర్త, ఆడపడుచుపై అల్వాల్ ఠాణాలో రుహిసుల్తానా వరకట్నం కేసు నమోదు చేసింది. శుక్రవారం రాత్రి టోలిచౌకిలోని అమ్మగారింట్లో అందరూ మాట్లాడుతుండగా రుహిసుల్తానా పడక గదిలోకి వెళ్లి దుపట్టాతో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. ఇంట్లో నుంచి ఎంతకు రాకపోగా, బాబు ఏడుపులు వినిపించడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. తెరుచుకోకపోవడంతో పొరుగు వారి సాయంతో పగులగొట్టి చూడగా ఉరేసుకొని మృతి చెంది కనిపించింది. తల్లి అతియా బేగం(70) ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎం.ఎ.కరీం

పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించండి

పరిగి, న్యూస్‌టుడే: పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకలాజిస్టు డాక్టర్ ఎం.ఎ.కరీం అన్నారు. శనివారం పరిగిలో మైండ్ పవర్‌పై 'విద్యార్థులు- మానసిక సమస్యలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ర్యాంకుల కోసం ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పిల్లల స్థాయిని గమనించాలని సూచించారు. విద్యార్థులకు శారీరక శ్రమ అందించే ఆటపాటలు నేర్పించాలని, అప్పుడే ఫోన్లకు దూరంగా ఉంటారని తెలిపారు. అనంతరం జ్ఞాపక పోటీ పరీక్షలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. మెజీషియన్ రామకృష్ణ ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది.

పౌష్టికాహారం అందించేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, చిన్నకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు పౌష్టికాహారం అందించేలా సభ్యులు, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జాతీయ ఆహార భద్రత చట్టం-2013 జిల్లాలో అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆహారభద్రత కార్డుల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం అందించాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న పిల్లలను బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. బడుల్లో మెనూ ప్రకారం ఆహారం అందించేలా పర్యవేక్షిస్తామన్నారు. అంతకుముందు సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కస్తూర్బా, సాంఘిక సంక్షేమ గురుకులం, చిన్నకోడూరు ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీఎస్‌వో తనూజ, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో యాదవరెడ్డి, చిన్నకోడూరు సీడీపీవో శారద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు షురూ

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ శివారులోని మొగిలిచర్ల మైదానంలో అండర్-19 క్రికెట్ పోటీలను కుడా (కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు. పూల్ 'ఏ'లో వరంగల్, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్, పూల్ 'బీ'లో ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల జట్లు ఆడుతున్నాయి. ఈ నెల 30 వరకు పూల్ ఏ, అక్టోబరు 1 నుంచి 3 వరకు పూల్ బీ జట్లు లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఆడనున్నాయి. అక్టోబరు 4, 5 తేదీల్లో సెమీస్, ఫైనల్స్ ఉంటాయి. ● కోమటిపల్లి క్రికెట్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 21.2 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 55 పరుగులతో గెలిచింది.

ఆహార జాగ్రత్తలతో గుండె పదిలం: ఎస్పీ



బెలూన్లను వదులుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఆహార జాగ్రత్తలు, వ్యాయామంతో గుండె పదిలంగా ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. అధిక వేపుడు పదార్థాలు, బయటి చిరుతిళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, పట్టణ గ్రామీణ సీఐలు భాస్కర్, బాలాజీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రీధర్, శైలజ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సందడి..

మెతుకుసీమ మణిహారం.. మంజీరా నాదం

న్యూస్‌టుడే, సిద్దిపేట

మంజీర నది పరవళ్లలో పులకించిన పుడమి తల్లిలో పురుడుపోసుకున్న సాహిత్య, సాంస్కృతిక చేతనమే మంజీరా రచయితల సంఘం (మరసం). ఉమ్మడి మెదక్ జిల్లాలో 1986' జులై 20న ఆవిర్భవించింది. నదీ ప్రవాహం మాదిరి ప్రజా జీవితంతో మమేకమైన ఈ సాహితీవృక్షం 38వ పండగకు సిద్ధమైంది. సాంఘిక సమకాలీన అంశాలకు దర్పణం పట్టి.. ప్రగతిశీల సాహిత్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా మెతుకు సీమను మురిపించిన ఈ సంఘం సిద్దిపేటలో ఆదివారం వార్షికోత్సవం జరుపుకోనున్న వేళ కథనం.



ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న కాళోజీ

నెలకోసారి సమావేశం

ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి సంస్థకు రూపకల్పన చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. మరసం 60 వరకు పుస్తకాలు వెలువరించింది. కవితలు, కథలు, పాటలు, వ్యాసాల సంకలనాలు, సంపుటిలుగా పుస్తకాలు వెలువరించడంతో పాటు కవులతో ముఖాముఖి వంటి వాటితో ప్రత్యేకత చాటుతున్నారు. సమాజ క్షేమాన్ని కాంక్షిస్తూ గొల్లసుద్దులు, వీధి నాటకాలు, ఇతర రూపాల్లో ప్రదర్శించారు. స్థానిక భాషను కవిత్వం, పాటలు, నాటకం, కథల ప్రక్రియల్లో నిక్షిప్తం చేస్తున్నారు. నెలకోమారు సమావేశం నిర్వహిస్తూ చైతన్య గళాన్ని వినిపిస్తున్నారు.



ర్యాలీలో సంఘం సభ్యులు

ఉమ్మడి జిల్లాలో ఏకైక నది మంజీర. ప్రవహించే నది నాగరికతకు దర్పణం. ఈ స్ఫూర్తితో మరసం పేరు ఖరారు చేశారు. నది మాదిరి సాహిత్యం పరవళ్లు తొక్కించేలా కవులు, రచయితలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 50 మంది కవులు, రచయితలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. కష్టజీవికి ఇరువైపులా ఉన్నవాడే కవి అనేది మహాకవి శ్రీశ్రీ మాట. వారి స్ఫూర్తిగా.. మరసం మెతుకుసీమలో అంతర్భాగమైంది. ఇందులో యువ కవులను భాగస్వాములను చేస్తున్నారు.



కవితాసంపుటి ఆవిష్కరణలో సినారె

చైతన్య కార్యక్రమాలు..

● వివాహ వ్యవస్థలో మార్పు తేవాలని వరకట్న రహిత వివాహాలు చేపట్టారు. సభావివాహాలు జరిపించారు. ● తెలంగాణ భాష, యాసకు పెద్దపీట వేస్తున్నారు. నందిని సిధారెడ్డి రచించిందే నాగేటి సాల్లల్ల నా తెలంగాణ.. పాట. కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ రాసిన పాటలు ప్రజల మనసును దోచాయి.

● సిద్దిపేటలో నిర్వహించిన తెలంగాణ చైతన్య వేదిక ఆవిర్భావ సభలు ఉద్యమానికి ఊపు తెచ్చాయి.

● సాహిత్యంలో ప్రతిభావంతులకు పురస్కారాలు అందిస్తున్నారు.

● వరకట్నం, మద్యపాన వ్యతిరేక ప్రదర్శనలు సహా రైతుల ఆత్మహత్యల నివారణకు ర్యాలీలు నిర్వహించారు. ● పదేళ్ల మహాసభల సమయంలో ప్రత్యేక సంచికను రూపొందించారు. మంజీర పేరిట త్రైమాసిక సాహిత్య సంచిక వెలువరించారు.

నిత్య నూతనంగా..

తెలంగాణ అస్తిత్వ మాండలికాన్ని సాహిత్యంలో ప్రవేశపెడుతున్నారు. జనరంజకమైన భాషను వచనంలో వ్యక్తీకరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. కొవిడ్ లాంటి పరిస్థితుల్లో మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కార్యక్రమాలు చేపట్టారు. 2019 అక్టోబరు 7న 'మరసం మంజీర' పేరిట యూట్యూబ్ ఛానెల్‌ను ఆరంభించారు. ప్రసంగాలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలను అప్‌లోడ్ చేస్తున్నారు. బ్లాగ్‌స్పాట్, ఫేస్‌బుక్, ట్విటర్ ఖాతాలూ ఉన్నాయి.

జీవద్భాషను వ్యక్తీకరించి..

ప్రస్తుతం సంఘ అధ్యక్షుడిగా కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా డా. సిద్దెంకి యాదగిరి, సభ్యులు, ప్రముఖ కవులు, సాహితీవేత్తలు డా. నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కె. అంజయ్య, కందుకూరి శ్రీరాములు, అలాజిపూర్ కిషన్, తైదల అంజయ్య, రాజిరెడ్డి, పొన్నాల బాలయ్య, గంభీరావుపేట యాదగిరి తదితరులు సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ ప్రాంత భాషను సాహిత్యంలో జొప్పించి.. జీవద్భాషను వ్యక్తీకరిస్తున్నారు. తెలంగాణ పలుకుబడుల భాషను రచనల్లో ప్రస్ఫుటిస్తున్నారు.

నిరంతర కార్యాచరణతో..:

మరసం ఉమ్మడి జిల్లా వేదికగా ఆవిర్భవించినా తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న సాహితీ సంస్థగా ఎదిగింది. నిరంతర కార్యాచరణతో సాధ్యమైంది. ప్రజా సమస్యలే ఎజెండాగా సాహిత్యాన్ని సృషించడం ప్రత్యేకం. మరసం ప్రేరణతో చాలా మంది కవులు వచన కవిత్వంలో పుస్తకాలు వెలువరించారు. సామాజిక మార్పు కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించింది. నేటి సభకు సాహితీవేత్తలు, సాహితీప్రియులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

కె.రంగాచారి, మరసం అధ్యక్షుడు

రైతును బలిగొన్న విద్యుత్తు తీగ



యాదగిరి

దుబ్బాక, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తిలో చోటుచేసుకుంది. భూంపల్లి ఎస్సై వి.హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కమటం యాదగిరి (42) వ్యవసాయం చేస్తూ భార్యా పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఊరి శివారులో ఉన్న పొలంలో బోరు మోటారు మరమ్మతులు చేయడానికి ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలోనే పొలం సమీపంలో ఉన్న నియంత్రిక వద్ద విద్యుత్తు సరఫరా నిలిపివేసే క్రమంలో జంపర్ రాడ్ పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదగిరి తిరిగి రాకపోయే సరికి ఆయన తండ్రి లక్ష్మీనారాయణ పొలానికి వెళ్లగా నియంత్రిక వద్ద విగత జీవిగా పడి ఉండటాన్ని చూసి బోరున విలపించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్‌లోని ఓ మద్యం దుకాణం సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన అంసానిపల్లి శ్రీనివాసరెడ్డి(50) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న లిక్కర్ మార్ట్ సమీపంలో శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొడుకు వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125–00	డ్రెస్డ్ 213–00	
రిటైల్ 147–00	స్కిన్‌లెస్ 243–00	

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, వాటికి ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. మనోహరాబాద్ మండలం గౌతోజీగూడలో ఈ నెల 10న డప్పు కొట్టలేదని ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయగా, 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదైన విషయం విదితమే. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి విచారణ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన చంద్రం, అర్జున్‌లు డప్పు కొట్టలేదని బహిష్కరించడం దారుణమన్నారు. గ్రామస్థులంతా కలిసి ఉండాల్సింది పోయి ఇలాంటి దారుణ ఘటనలకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. బాధ్యులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణానికి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. బాధిత కుటుంబీకులు మాకు రక్షణ కల్పించాలని కోరారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు, శంకర్, ప్రవీణ్, తహసీల్దారు చంద్రశేఖర్, సీఐ రంగకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గౌతోజీగూడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బక్కి వెంకటయ్య

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని చిన్నారి లభ్యం



చేగుంట, న్యూస్‌టుడే: చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో రెండేళ్ల వయసున్న గుర్తుతెలియని చిన్నారి దొరికినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 26న ఉదయం చిన్నారి రైల్వేస్టేషన్‌లో ఏడుస్తుండగా ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్‌కు చెప్పినట్లు తెలిపారు. స్టేషన్‌మాస్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిన్నారిని తీసుకొని స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. రెండు రోజుల పాటు చూసినా ఎవరూ రాకపోవటంతో మెదక్ జిల్లా బాలల సంరక్షణ అధికారికి అప్పగించినట్లు తెలిపారు. చిన్నారికి సంబంధించిన వారు ఉంటే చేగుంట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

భార్యపై భర్త కత్తితో దాడి

కొడంగల్: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన వికారాబాద్ జిల్లా రుద్రారంలో చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన విజయలక్ష్మి, శాంతప్ప దంపతులు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన గొడవలో శాంతయ్య భార్య విజయలక్ష్మిపై కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. శనివారం కేసు నమోదు చేసి భర్తను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఏటీఎం కార్డు అపహరించి డబ్బు డ్రా

రామాయంపేట: ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కార్డు అపహరించి.. నగదు విత్‌డ్రా చేసిన ఘటన రామాయంపేటలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని కాట్రియాలకు చెందిన రాజయ్య రామాయంపేట ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బు తీసుకునేందుకు ఈనెల 25న వచ్చాడు. అప్పుడే ఏటీఎంలోకి వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు రాజయ్యను మాటల్లో పెట్టి ఆయన కార్డు తీసుకొని వేరేది ఇచ్చారు. డబ్బు రాకపోవడంతో రాజయ్య ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి రెండు విడతలుగా రూ.71వేలు డ్రా అయినట్లు ఆయనకు సమాచారం వచ్చింది. రాజయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్రీడలతో మానసికోల్లాసం

● రాజన్న సర్కిల్ సీసీఎఫ్ శరవణన్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శరవణన్ తదితరులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని రాజన్న సర్కిల్ అటవీశాఖ ముఖ్య అధికారి శరవణన్ పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రాజన్నసర్కిల్ రెండవ జోనల్ క్రీడోత్సవాలు శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యంగా ఒత్తిడిలో ఉద్యోగాలు చేసే వారికి క్రీడలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సిద్దిపేట, మెదక్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 200 వందల మంది ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మొదటిరోజు వాలీబాల్, కబడ్డీ, షటిల్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పీఈటీలు రామేశ్వర్‌రెడ్డి, సుజాత, వెంకటస్వామి గౌడ్, ఉప్పలయ్య, కనకారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్‌మోహన్‌గౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, బాలమణి, నిఖిత, జోజి, ఇక్రమొద్దీన్, సందీప్‌కుమార్, పద్మారెడ్డి, పద్మ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం అందిస్తూ..

సేదతీరుస్తూ..

ఆ అతిథిగృహం లోపలికి అడుగు పెట్టగానే ఏపుగా పెరిగిన వృక్షాలు స్వాగతం పలుకుతాయి. పచ్చదనం కనువిందు చేస్తుంది. జహీరాబాద్‌లో 65వ నంబరు జాతీయ రహదారికి పక్కన దశబ్దాల క్రితం నిర్మించిన ర.భ. అతిథిగృహం విశేషాలివి. మూడు దశాబ్దాల కిందట నిర్మించింది కాగా, విశాలమైన ఆవరణలో మొక్కలు నాటగా అవిప్పుడు పెరిగి వృక్షాలుగా మారాయి. అధికారులు వాటి చుట్టూ కూర్చునేందుకు వీలుగా అరుగులు మాదిరిగా నిర్మించారు. దీనికి సమీపంలో పోలీసుస్టేషన్, బస్టాండు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం ఆయా చోట్లకు వస్తున్న వారితో పాటు పట్టణవాసులు ఈ చెట్ల కిందే సేద తీరుతుంటారు.

- న్యూస్‌టుడే, జహీరాబాద్



మైనం చుక్క.. ఎంచక్కా

న్యూస్‌టుడే, జిన్నారం: బాతిక్.. ఇండోనేషియా, శ్రీలంక, మలేసియాలో పేరున్న కళ. దీన్ని మైనం చుక్కగా పేర్కొంటారు. పగుళ్లగా కళారూపం ఉండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ కళ కోల్‌కతాకు తొలిసారిగా రాగా రాష్ట్రానికి చెందిన కాపు రాజయ్య, యాసాల బాలయ్య వంటి వారు నేర్చుకున్నారు. బాలయ్య బాతిక్ కళానైపుణ్యంతో బాతిక్ బాలయ్య, బాతిక్ పికాసోగా పేరుగాంచారు. ఆయన కుమారుడు యాసాల ప్రకాశ్ ప్రస్తుతం ఇదే తరహాలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ కాపాడుతుండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జిన్నారం గిరిజన గురుకుల ఉపాధ్యాయుడైన ప్రకాశ్.. బోధనతో పాటు తాను గీసిన చిత్రాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో ఒకే ఒక్క బాతిక్ కళాకారుడిగా గుర్తింపు పొందారు. ప్రకాశ్ బాతిక్ చిత్రాలకు మంచి గుర్తింపు ఉంది.



మాజీ గవర్నర్ తమిళసైకి వస్త్రంపై చిత్రాన్ని చూపుతూ..

ప్రభుత్వ కార్యక్రమాలకు, విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు ఈయన చిత్రాలను జ్ఞాపికలుగా ఇస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో అదానీ గ్రూప్ ఛైర్మన్‌కు ఇచ్చిన జ్ఞాపిక ప్రకాశ్‌దే కావడం విశేషం. మాజీ సీఎం కేసీఆర్ సైతం మెచ్చుకున్నారు.

సంప్రదాయ రూపాలు..

బతుకమ్మ, బోనాలు, కొమ్ముకోయ, గుస్సాడి, పేరిణి నృత్యం, ఖవ్వాలి వంటి వాటికి తన చిత్రాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తారు. అదే సమయంలో యువతను ఆకట్టుకునేలా నేటి ఫ్యాషన్‌కు తగ్గట్టుగా కొన్ని కళారూపాలు తయారు చేస్తున్నారు. ప్రకాశ్ సతీమణి మమత బోరబండలో పలువురు మహిళలతో కలిసి యూనిట్ నిర్వహిస్తున్నారు. దీనిద్వారా గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్స్ ఎంపోరియమ్, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షికి పంపిస్తున్నారు.

ఇలా చేస్తారు..

తెల్ల, పసుపు పచ్చ మైనం కలిపితే ఓ ద్రావణం వస్తుంది. దీన్ని ప్రత్యేక బాతిక్ కలంతో కాటన్ వస్త్రంపై డిజైన్ వేస్తారు. అది ఎప్పటికీ చెరిగిపోదు. ఒక వస్త్రాన్ని ఒక్కసారి మాత్రమే వినియోగిస్తారు. 'ఇప్పటివరకు వేలాది కళారూపాలు వేయగా.. కొన్నింటిని ప్రభుత్వం విదేశీయులకు జ్ఞాపికలుగా ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుందని, నేటి యువత కళను నేర్చుకునేందుకు ముందుకు రావాల'ని కోరుతున్నారు ప్రకాశ్.



బాతిక్ కళారూపం

దృష్టిసారిస్తే.. లాభాల పయనం

న్యూస్‌టుడే, పరిగి, మోమిన్‌పేట: పొదుపు సంఘం సభ్యులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు రకాలుగా కృషి చేస్తోంది. ఇందుకు వివిధ పథకాలను అమలు చేస్తోంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలో నాలుగేళ్ల క్రితం సన్న, చిన్నకారు మహిళా సభ్యులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని నెలకొల్పారు. మండలంలో 921 సంఘాలు ఉండగా, 9217 మంది సభ్యులుగా ఉన్నారు. వీటిలో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రంలో 91 సంఘాలకు చెందిన 1347 మంది సభ్యులుగా చేరారు. ప్రారంభించిన సమయంలో సభ్యులతో ప్రయోగాత్మకంగా పరిసర గ్రామాల్లో పండించిన కూరగాయలను కొనుగోలు చేశారు. ఒప్పందం కుదుర్చుకున్న బెనెషా కంపెనీకి విక్రయించారు. మొత్తం 1182.25 మెట్రిక్ టన్నుల అమ్మకంతో రూ. లక్షల్లో ఆదాయం వచ్చింది. దీంతో సంఘాల బలోపేతానికి మార్గం ఏర్పడింది.



నిరుపయోగంగా పరికరాలు

రవాణా ఛార్జీలతో..

కేంద్రం ఏర్పాటు మండలంలో కూరగాయల సాగు విస్తీర్ణమూ పెరిగింది. రెండేళ్ల పాటు లాభాలు ఆర్జించగా, ఆ తర్వాత రవాణా ఛార్జీల భారంతో విక్రయాలు తగ్గాయి. మరోవైపు సదరు కంపెనీ నిర్వాహకులు బహిరంగ మార్కెట్ ధరకు కొనకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతో నష్టాలే మిగిలాయి. కంపెనీ వారు సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో విక్రయాలకు ప్రధాన అవరోధంగా మారింది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.



అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రం

ఆశించిన ధర రాక..: శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్

బహిరంగ విపణి ధర లభించక కూరగాయల విక్రయానికి రైతులు ముందుకు రాలేదు. దీంతో ఏడాదిన్నరగా కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కందులు, మినుములు, పెసర, మొక్కజొన్న కొనుగోళ్లకు కార్యాచరణ రూపొందించాం. 458 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసి నాఫెడ్‌కు విక్రయించాం. తద్వారా రూ.3.4లక్షల లాభం చేకూరింది.

బీకాంతో ఉజ్వల భవిష్యత్తు

మెదక్ టౌన్: బీకాం చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్ సూచించారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ కోర్సులో చేరిన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీకాంతో పలు ఉన్నత కోర్సులు చదివే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి శరత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీకాంకు సంబంధించిన క్రెడిట్, గ్రేడింగ్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సురేందర్‌రావు, ఇన్‌ఛార్జి పీడీ వెంకటేశ్వర్లు, తెలుగు విభాగాధిపతి వామనమూర్తి, అధ్యాపకులు చంద్రశేఖర్, హరిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ..

పోటీ పరీక్షల్లో రాణించాలని బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరేందర్ విద్యార్థులకు సూచించారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంస్థ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే రూ.10వేల విలువైన పుస్తకాలను కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్‌కు అందించారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ ఉన్నారు.

పల్లెల్లో పరిశుభ్రత కరవు

● మండల కేంద్రం పెద్దశంకరంపేట పాత బస్టాండ్ వద్దనున్న మురుగు కాలువను కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు వ్యాపిస్తూ వ్యాధుల బారిన పడుతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముక్కు మూసుకోవడం తప్ప ఈ రహదారి వెంట వెళ్లేవారికి పరిస్థితి నెలకొందని అంటున్నారు.

● మండల కేంద్రం పాపన్నపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాలువను కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచాయి. పారిశుద్ధ్య లోపం కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు.

న్యూస్‌టుడే- పెద్దశంకరంపేట, పాపన్నపేట

గ్రామాల్లో ప్రత్యేక పాలన వచ్చినా ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధులు అపరిశుభ్రంగా మారాయి. సర్పంచుల పాలన ముగిసిన తరవాత పల్లెల్లో సమస్యలను పట్టించుకునే వారే కరవయ్యారని వాపోతున్నారు. గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారులు అప్పుడప్పుడు చూడకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవడంతో కార్యదర్శులు సైతం పనులు చేసేందుకు ముఖం చాటేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రత్యేక పాలన గ్రామాల్లో గాడి తప్పుతోంది.

జ్వరాల బారిన ప్రజలు

మురుగు కాల్వలతో ఇబ్బందులు..

పెద్దశంకరంపేట మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి 9 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. పాపన్నపేట మండలంలో మొత్తం 36 పంచాయతీలుండగా.. మొత్తం 13 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. ఒక్కో అధికారికి మూడు, అంతకంటే ఎక్కువ గ్రామాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. చాలా గ్రామాల్లో మురుగు కాల్వల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో పందులు, దోమలు పెరుగుతూ పల్లెవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల నివారణకు ఎక్కడా ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



పెద్దశంకరంపేట పాతబస్టాండ్ వద్ద..

దీంతో జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నామని చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

– గ్రేస్‌బాయి, ప్రత్యేకాధికారి

గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు మా దృష్టికి తెచ్చిన సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. పారిశుద్ధ్య లోపం లేకుండా తగిన చర్యలు చేపడతాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్: ? నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్‌లో పశు వైద్యశాల ఏర్పాటు చేయాలి. నర్సాపూర్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. పశువుల వ్యాధుల బారిన పడితే పెద్దచింతకుంటకు తీసుకురావాల్సిన దుస్థితి. – రాముగౌడ్, ఇబ్రహీంబాద్

✓ గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి నివేదిక తయారు చేసి పంపుతాం. మంజూరైతే ఏర్పాటు చేస్తాం. – జనార్దన్‌రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ

? జక్కపల్లిలో నీటిశుద్ధి యంత్రం వృథాగా ఉంది. మరమ్మతులు చేస్తే ఉపయోగపడుతుంది. పక్క గ్రామాలకు వెళ్లి తీసుకురావాల్సి వస్తోంది. – మహేష్, జక్కపల్లి

✓ వారంలోగా తగు చర్యలు చేపట్టి, మరమ్మతులు చేయించి వినియోగంలోకి వచ్చేలా చూస్తాం. – శ్రీనివాస్, ఎంపీవో

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ మున్సిపాలిటీలో శనివారం రూ.1.50కోట్లతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ నందాల శ్రీనివాస్‌తో కలిసి 6వ వార్డులోని మారుతీనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినొద్దీన్, కౌన్సిలర్లు జ్యోతి రవీందర్‌గుప్తా, భగవాన్ రెడ్డి, రాజు, రఘుపతి తదితరులున్నారు.

స్పందించండి.. కొమ్మలు తొలగించండి



మండల కేంద్రం పాపన్నపేటలో మోడుబారిన చెట్టు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే దారి పక్కన మూడు చెట్లు ఎండిపోయాయి. కొమ్మలు రోడ్డుపైకి వాలాయి. గాలులు వీచినప్పుడు వాహనదారులు, కాలి నడకన వెళ్లే వారిపై పడే అవకాశముంది. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తెగించి పోరాడిన వీరుడు భగత్‌సింగ్ అని పలువురు కొనియాడారు. మెదక్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేగుంటలో తపస్ నాయకులు, పెద్దశంకరంపేట, టేక్మాల్‌లో భాజపా నేతలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం



మెదక్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

దేశ అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి

మనోహరాబాద్, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమంతో పాటు దేశ అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మనోహరాబాద్ మండల భారాస అధ్యక్షుడు పురం మహేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు శనివారం శామీర్‌పేటలోని ఈటల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఆయనను కలిసిన వారిలో భాజపా రాష్ట్ర నాయకుడు నత్తిమల్లేశ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్‌చారి, నాయకులు మల్లేశ్, నాగరాజు, సుధాకర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

శివ్వంపేట: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో శనివారం వినాయక నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, భారాస నాయకులు పబ్బ మహేష్‌గుప్తా, మన్సూర్, కాంగ్రెస్ నేతలు పులిమామిడి నవీన్‌గుప్తా, వారాల గణేశ్ పూజలు చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చరవాణి అప్పగింత

మెదక్: చరవాణి పోగొట్టుకున్న డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి అదనపు ఎస్పీ మహేందర్ అందించారు. మెదక్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న మురళి గతేడాది బస్సులో వెళుతుండగా చరవాణి పోయింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదయ్యాయి. చరవాణి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం కాట్రావుపల్లి వద్ద లభించింది. ఏపీ పోలీసుల సహకారంతో తెప్పించగా.. శనివారం ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ అధ్యాపకుడికి అందించారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బైండ్ల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు

శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాగి రాములు, శ్రీనివాస్, స్వామి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కార్యదర్శులుగా శివరాజ్, శ్రీనివాస్, యాదగిరి, సంయుక్త కార్యదర్శులుగా గణేష్, కిషన్, కోశాధికారిగా గంగారాం, అధికార ప్రతినిధిగా పాపన్నపేట శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా భీమరి కుమార్ ఎన్నికయ్యారు.

ధర్మ పరిరక్షణకు కృషి

పాపన్నపేట: నిత్యం భగవంతుణ్ని స్మరించాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ అన్నారు. శనివారం మండల పరిధి నాగ్సాన్‌పల్లి ఉమాకేదారేశ్వర ఆలయంలో మాసపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులు ఆయనకు పాదపూజ చేశారు. అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, నర్సింహులుగుప్తా, ప్రసాద్‌గుప్తా, సాయిబాబా, మహేందర్ పాల్గొన్నారు.

చాకరిమెట్లలో ప్రత్యేక పూజలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామం చాకరిమెట్ల అడవిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.



ఆర్చి నిర్మాణం ఆపాలని తాఖీదు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని వెంచర్‌లో హెచ్ఎండీఏ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ప్రవేశ ద్వారం పనులను నిలిపివేయాలని నిర్వాహకులకు పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షకుడు ప్రభాకర్ శనివారం తాఖీదు ఇచ్చారు. పురపాలికకు అప్పగించిన స్థలంలో నిర్మించడం తగదన్నారు.

కోలుకుంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు శుక్రవారం ఢీకొన్న ఘటనలో గాయపడిన విద్యార్థులు కోలుకుంటున్నారు. సూరారం ప్రైవేటు ఆసుపత్రిలో ఇద్దరు విద్యార్థులు, డ్రైవర్‌కు శనివారం వైద్య పరీక్షలు చేశారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రమాదంలో మృతిచెందిన మరో డ్రైవర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లీకుమారుడు ఆత్మహత్య

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: రెండేళ్ల కిందట ఇంటి పెద్ద చనిపోయాడు. బంధువులతో సంబంధాలు తెగిపోయాయి. అప్పులు పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో తల్లీకుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వారాసిగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన నంపరి లక్ష్మణ్‌రావు, జయలక్ష్మి(63) దంపతులు. లక్ష్మణ్‌రావు విశ్రాంత బ్యాంకు ఉద్యోగి. 2020లో చనిపోయారు. ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి కుమార్తె (వివాహిత), కుమారుడు రవికాంత్ (36)ఉన్నారు. తండ్రి చనిపోయిన నాటి నుంచి ఆర్థిక సమస్యలు పెరిగాయి. దీంతో అప్పులపాలయ్యాడు. అప్పటికే బంధువులతో సంబంధాలు తగ్గిపోయాయి. రవికాంత్ ప్రైవేటు ఉద్యోగం చేసి వదిలేశాడు. సమస్యలతో మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో తల్లీ కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కూతురు జయలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు.

30న పుర సర్వసభ్య సమావేశం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పురపాలిక సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఉదయం 11 గంటలకు పుర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ జానకిరామ్ సాగర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటి చుక్క లేని తొట్టి

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రం పాపన్నపేటలో నెహ్రూ విగ్రహం వద్ద ఉపాధిహామీ నిధులతో కొన్నేళ్ల కిందట నీటి తొట్టి నిర్మించారు. అనువు గాని చోట నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. పక్కనే నీటి సౌకర్యమున్నా వృథాగా ఉంటోంది. దాహార్తి తీర్చుకునేందుకు వచ్చే పశువులు నీరు లేకపోవడంతో వెనుదిరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట



పుర అభివృద్ధికి సహకరించండి: కమిషనర్

నర్సాపూర్, న్యూస్‌టుడే: పుర పరిధిలోని ప్రజలు నెలనెలా నల్లా బిల్లులను తప్పక చెల్లించాలని కమిషనర్ రామకృష్ణారావు అన్నారు. ప్రతి నల్లా కనెక్షన్‌కు నెలకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. 15 వార్డుల్లో మొత్తం రూ.38 లక్షల బకాయిలున్నాయని తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించి పురపాలిక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పాఠశాల వద్ద స్టాపర్ ఏర్పాటు

చేగుంట: మండల పరిధి కరీంనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా రెండు వరుసల రహదారిపై దాతల సహకారంతో శనివారం స్టాపర్ ఏర్పాటు చేశారు. చేగుంట నుంచి దౌల్తాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఒకవైపు ఉన్నత పాఠశాల, మరోవైపు మధ్యాహ్న భోజనం వడిస్తారు. విద్యార్థులు భోజనానికి రోడ్డు దాటే క్రమంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. హెచ్ఎం గంగారావు, ఉపాధ్యాయులు పెంటాగౌడ్, జగన్‌లాల్, పూర్ణచందర్, కృష్ణమూర్తి, సంధ్య, వాణి, స్వప్న, నాగరాజు పాల్గొన్నారు.

అందుబాటులో ఓటరు తుది జాబితా

చిన్నశంకరంపేట: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఓటరు తుది జాబితా అందుబాటులో ఉందని ఎంపీడీవో దామోదర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు అందించిన వారికి సంబంధించి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు పూర్తయ్యాయని తెలిపారు.

చదువుపై దృష్టి సారించాలి

చేగుంట, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిని పెట్టాలని చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి అన్నారు. శనివారం వడియారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం, షీటీం సంయుక్తంగా సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలకు ఆశపడి నష్టపోవద్దన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

చారిత్రక కట్టడాల చిత్ర ప్రదర్శన

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా హవేలిఘనపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం జిల్లాలోని చారిత్రక కట్టడాల ఫోటో ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ సృజన, ఏటీపీ నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే

చేగుంట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ విమర్శించారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. చేగుంటకు డిగ్రీ కళాశాల మంజూరు చేయిస్తానని చెప్పి ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

తూప్రాన్: యావాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తలకొక్కుల చంద్రకళ-లక్ష్మణ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించేందుకు టీవీ, ఎల్ఈడీ స్క్రీన్ అందించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తూప్రాన్: ఆరు గ్యారంటీల్లో భాగంగా లబ్ధిదారులకు శనివారం పుర కార్యాలయంలో మహాలక్ష్మి పథకం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ ఖాజామోయినోద్దీన్ పాల్గొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జీవిఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకే బాలమేళా

శివ్వంపేట, న్యూస్‌టుడే: బాలల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలమేళా నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష తెలిపారు. శనివారం శివ్వంపేట అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్య నేర్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, నవీన, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో చాక్‌డౌన్, పెన్‌డౌన్

కౌడిపల్లి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐకాస పిలుపు మేరకు శనివారం చాక్‌డౌన్, పెన్‌డౌన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి బోధనతోపాటు కార్యాలయ పనులను బహిష్కరించారు. ప్రిన్సిపల్ ఫణికుమార్ మాట్లాడుతూ.. డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నర్సింహ, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ భవానితోపాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్యూబ్‌లైట్లు, ఎరువుల తయారీపై శిక్షణ

మెదక్ అర్బన్: శిక్షణ శిబిరాలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో దోహదపడతాయని ఎంఈవో నీలకంఠం అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర న్యూ హైస్కూల్లో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ట్యూబ్ లైట్ మేకింగ్, సేంద్రియ ఎరువుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు సమన్వయకర్త రాజశేఖర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చిన్నశంకరంపేట: సూరారంలో సూచనలిస్తూ..

కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దశంకరంపేట తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎస్సై శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో వారు మాట్లాడారు. మండల కేంద్రం టేక్మాల్‌లో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రేగోడ్, నర్సాపూర్, హవేలిఘనపూర్ మండలాల్లో తహసీల్దార్లు నరేశ్, శ్రీనివాస్, సింధు రేణుక, చిన్నశంకరంపేటలో ఎంపీడీవో దామోదర్, చిలప్‌చెడ్ మండలంలో తహసీల్దార్ ముసాదిక్, ఏఎస్సై మిస్బాద్దీన్ తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేట మండలంలో తహసీల్దార్ కమలాద్రి, ఎస్సై మహిపాల్‌రెడ్డి, ఉపతహసీల్దార్ షఫియొద్దీన్, వెల్దుర్తిలో ఏఎస్సై సాదత్‌మియా, అల్లాదుర్గంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్ కార్యక్రమాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

తాళం వేసిన ఇంట్లో చోరీ

నార్సింగి(చేగుంట): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. శేరిపల్లిలోకి చెందిన తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి తాళం వేసి బస్వాపూర్‌కు వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి పైకప్పు నుంచి లోపలికి ప్రవేశించి 8 గ్రాముల బంగారం, రూ.50వేల నగదు చోరీ చేశారు. రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన బాధితుడు చోరీ జరిగినట్లు గుర్తించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సత్ఫలితాలు సాధించండి

పెద్దశంకరంపేట: శిక్షణతో సత్ఫలితాలు సాధించాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం అన్నారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో మంచినీటి సహాయకులకు చివరి రోజు శిక్షణలో భాగంగా ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించుకొని నీటి ఎద్దడి లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీఖున్నీసా, ఏఈ రమేశ్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేయండి

కొల్చారం: ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ అరిగె రమేశ్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల రైతులతో మహాజన సభ నిర్వహించారు. సంఘంలో రుణాలు పొందిన కొందరు రైతులకు మాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మోత్కు మల్లేశం, సీఈవో నవీన్, సిబ్బంది బీరప్ప తదితరులు పాల్గొన్నారు.